క్లుప్తంగా

డబుల్ బెడ్రూం కేటాయింపులో అన్యాయం



ఆర్డీఓ రమాదేవికి వినతిపత్రం అందజేసిన రాజు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం జరిగిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు కమిటీ సభ్యుడు పాతూరి రాజు ఆరోపించారు. శుక్రవారం మెదక్ ఆర్డీవో రమాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనాభా ప్రతిపాదికన ఎస్సీ, ఎస్టీలకు కనీసం 20 నుంచి 25 వరకు గృహాలు మంజూరు కావాల్సి ఉండగా, కేవలం నాలుగైదు మాత్రమే కేటాయించారని ఆరోపించారు. ఈ విషయమై తమకు న్యాయం జరిగే వరకు విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజని కుమారి ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంఈఓ

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ట్రీట్ కాస్ వాటర్ ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ని మండల విద్యాధికారి వెంకటేశం ప్రారంభించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నీటి వసతి కలిగించేలా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ వాలంటీర్స్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కంది రాజేశ్వర్, ఉపాధ్యాయులు సుధీర్, సత్యకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



ఉపాధ్యాయులను సన్మానించిన నరేందర్

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులను భావి భారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, ఎంఈఓ యాదగిరి అన్నారు. మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులను వారు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్, దినేష్ నాయకులు పోతిరెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లేశం, సాయిలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన



భూతవైద్యులు చేసే మోసాలు ప్రయోగాత్మకంగా చూపుతున్న నరేశ్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని గిరిజన గురుకుల పాఠశాలతో పాటు కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం మూఢనమ్మకాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ అవగాహన కల్పించారు. దొంగబాబాలు, భూత వైద్యులు అమాయకులను మోసం చేస్తున్న తీరును ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, శ్రీవాణి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, షరీఫ్, వైస్ ప్రిన్సిపాల్ మేరీతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం

చిన్నశంకరంపేట(మెదక్): మున్నూరుకాపు సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆకుల నాగరాజు నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘంరాష్ట్ర నాయకుడు రఘురాములు మాట్లాడుతూ.. మున్నూరుకాపులు రాజకీయంగా ఎదిగేలా కృషిచేయాలని కోరారు. గ్రామాల్లో మున్నూరుకాపు కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామకిష్టయ్య, సిద్ధిరాములు, గ్రామాల నాయకులు రాజు, రాములు, నాగరాజు, సిద్ధిరాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం ఎప్పుడు?

- 12 లక్షల గన్నీ బ్యాగులు అవసరం
- దొడ్డు, సన్నాళ్లకు వేర్వేరుగా కేంద్రాలు
- అయోమయంలో రైతులు



సంగాయిపేటలో ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ప్రారంభించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా అన్నిచోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న అధికారుల ఆదేశాలతో హడావిడి లేకుండా శుక్రవారం మండలంలో పలుచోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మరికొన్ని చోట్ల పాలకమండలి నిర్ణయాలతో మరో రెండు, మూడు రోజులు పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కానీ తూకం ఎప్పుడు మొదలవుతుందనేది తెలియడంలేదు.

ధాన్యం సేకరణ లక్ష్యం..

మండలంలో ఈసారి వానాకాలం దొడ్డు, సన్నరకం దాదాపు సరి సమానంగా సాగు చేశారు. మండల వ్యవసాధికారుల లెక్కల ప్రకారం 19,978 ఎకరాల్లో సాగు చేయగా, ఇందులో సన్నరకం 11,082.22 ఎకరాల్లో పంట సాగు చేయగా, దొడ్డురకం 8,694.21 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి గతంలో కంటే పంటపై చీడపీడల ప్రభావం తక్కువగా ఉండడం దిగుబడి కూడా ఎక్కువగా వచ్చి అవకాశాలున్నాయి. అధికారులు చెబుతున్న దాని ప్రకారం సన్నరకం 2659.73 మెట్రిక్ టన్నులు, దొడ్డురకం 2086.61 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. ధాన్యం సేకరణకు దాదాపు 12 లక్షల గన్ని బ్యాగుల అవసరం ఉంది. మండలంలో 21 కొనుగోలు సెంటర్లను ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నారు. పీఏసీఎస్ పరిధిలో 16, ఐకేపీ 3, ఎఫ్‌పీఓలో 3 ఉన్నాయి.

దొడ్డు, సన్నాల సెంటర్ల ఏర్పాటు

ఈసారి సన్న రకానికి ప్రభుత్వం బోనస్‌గా రూ.500 ప్రకటించడం, సన్న, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కానీ ఈ విషయంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. రెండు కేంద్రాల్లో ఏ ఒక్కటి లేనప్పటికీ, రెండు రకాల ధాన్యాన్ని పొలాల నుంచి తీసుకొచ్చి ఒకేచోట పోస్తుండడం కనిపిస్తోంది. ధాన్యం తూకం వేసే సమయంలో రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.



కొల్చారం(నర్సాపూర్): రంగంపేట పీఏసీఎస్‌లో ఆరబెట్టేందుకు తీసుకొచ్చిన ధాన్యం

కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామాయంపేట(మెదక్): చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, కోనాపూర్‌లో సహకార సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, రామాయంపేట, కోనాపూర్ సహకార సంఘాల అధ్యక్షులు బాదె చంద్రం, విజయలక్ష్మి, సీఈవోలు నర్సింలు, మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.



రామాయంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేగోడ్(మెదక్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ అన్నారు. మండలంలోని మర్పల్లి గ్రామంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భద్రారెడ్డి, నర్సింహరెడ్డి, కుమార్, రవి, ఐకేపీ సీసీ కిష్టయ్య, మాణిక్యంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు రావడంలేదు

- విద్యార్థుల రాస్తారోకో

రామాయంపేట(మెదక్): సకాలంలో ఆర్టీసీ బస్సులు రావడంలేదని ఆగ్రహం చెందిన విద్యార్థులు శుక్రవారం మండలంలోని అక్కన్నపేట వద్ద రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సుల ఆలస్యంతో తాము ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు ఆలస్యంగా వెళ్తున్నామని, ఈ విషయమై ఆర్టీసీ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాల పరిధిలోని శంఖాపూర్, ఝాన్సిలింగాపూర్, అక్కన్నపేట, ఖాజాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. ఈ ఆందోళనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులపాలయ్యారు. ప్రతిరోజూ బస్సుల్లో వెళ్లడానికి వీలుగా తాము పాసులు తీసుకున్నామని, బస్సులు రాకపోవడంతో డబ్బులు ఖర్చుపెట్టి, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బాలరాజు సంఘటనా స్థలానికి వెళ్లి విద్యార్థులను సముదాయించి వారితో ఆందోళన విరమింపజేశారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి



కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు కాంగ్రెస్ నాయకులు తొత్తులుగా వ్యవహరించడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం గ్రామసభలను ఏర్పాటు చేసి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు వేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలతోనే కమిటీలు వేస్తే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు, అవినీతి, అక్రమాలు జరుగుతాయన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేందుకు గ్రామసభల ద్వారా ఎంపిక చేయడం ఉత్తమమని తెలిపారు. అధికారులు స్పందించి ఇప్పటివరకు ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేయాలన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఎంపిక చేయాల్సిన బాధ్యత అధికారులపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, నాయకులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, రాజేందర్, అశోక్, మహిపాల్, నాగభూషణం, రాజు, ఆంజనేయులు, భాస్కర్, మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కృషి

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్

రామాయంపేట(మెదక్): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి హామీ ఇచ్చారు. శుక్రవారం రామాయంపేట, నిజాంపేట మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేసేది తమ సంఘం మాత్రమేనని, ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రాల్లో పనిచేస్తున్న విలేకరుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆరోపించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు కోసం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు సేకరించి రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసశర్మ, ఐజేయూ సభ్యుడు అశోక్, రాష్ట్రలిస్టుల సంక్షేమ కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్

ఉద్యోగ ఉపాధ్యాయులకు డీఏ ప్రకటించండి

పాపన్నపేట(మెదక్): ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పెండింగ్ డీఏలు ప్రకటించాలని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 5 డీఏలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో కనీసం 3 డీఏలు కేబినేట్ మీటింగ్‌లో మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



చెక్కు అందిస్తున్న ఉపాధ్యాయురాలు

చేగుంట(తూప్రాన్): పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయురాలు రూ.లక్ష విరాళం ప్రకటించారు. మండలంలోని వడియారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వసంత పాఠశాల అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళం ప్రకటించి, రూ.25 వేల చెక్కును హెచ్ఎంకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిద్ధిరాములు, ఉపాధ్యాయులు ప్రియదర్శిని, సంతోషిమాత, అమరేశ్వరి, నాయకులు నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించం: నరేశ్

దుబ్బాకటౌన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ ఎరువుల దుకాణదారులకు సూచించారు. మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనతంరం మాట్లాడుతూ దుకాణదారులు నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌష్టికాహారం ఎంతో అవసరం

- డీడబ్ల్యూఓ హైమావతి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ హైమావతి

మెదక్ కలెక్టరేట్: ఆడపిల్లలకు కౌమారదశ దశలో పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని డీడబ్ల్యూఓ హైమావతి పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. బాలికల కౌమారదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు పలు పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి కరుణశీల, ఇతర అధికారులు ఉప్పలయ్య, గంగాధర్, భరోసా కోఆర్డినేటర్ స్వరూప, స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ, ప్లాన్ ఇండియా టీమ్ సభ్యులు రాహుల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



కర్నాల్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి హైమవతి

చేగుంట(తూప్రాన్): పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని మండల ప్రత్యేక అధికారి జిల్లా సంక్షేమ అధికారి హైమవతి పేర్కొన్నారు. ఇటీవలే జిల్లాకు బదిలీపై వచ్చిన హైమవతి చేగుంట మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించి, చేగుంటతో పాటు కర్నాల్‌పల్లి గ్రామాలను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవను చూపించాలని ఎంపీడీఓ చిన్నారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంపునకు కృషి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తిలోని రాయరావు సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల హాజరుశాతం పెంపుదల, మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కొద్ది రోజులుగా విద్యార్థులు కళాశాలకు గైర్హాజరైతే వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కాగా శుక్రవారం మండలంలోని శేరీల, మెల్లూర్ గ్రామాలతో పాటు వెల్దుర్తి పట్టణంలోని పలు కాలనీలకు చెందిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లారు. ప్రతీరోజు తరగతులకు హాజరై క్రమశిక్షణతో విద్యనభ్యసించి బోర్డు పరీక్షలో ఉత్తీర్ణత సాధించేలా సహకారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



నెక్సస్ ఇంటెక్ కార్యక్రమానికి హాజరైన అతిథులు, విద్యార్థులు

నర్సాపూర్: నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అమెరికాలోని లెహి యూనివర్శిటి డిప్యూటీ ప్రొవోస్ట్ డాక్టర్ సబ్రినా జెడ్లికా అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన నెక్సస్ ఇంటెక్ జాతీయ స్థాయి పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరక్టర్ సతీష్ చంద్ర పరుచూరి, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, తదితరులు పాల్గొని మాట్లాడారు. వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అండర్-17 ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం, అండర్-14 పోటీల్లో తృతీయస్థానం సాధించారన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలువడంతో ఖోఖో జట్టు క్రీడకారులను హెచ్ఎం అనసూయ, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రథమస్థానంలో నిలిచిన జట్టు

సంక్షిప్త వార్తలు

◆ వృద్ధులకు పండ్ల పంపిణీ

నర్సాపూర్: తన పుట్టిన రోజును పురస్కరించుకొని మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్ శుక్రవారం వృద్ధులకు భోజనం సమకూర్చారు. పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోం లోని వృద్ధులకు భోజనం , పండ్లు అందజేశారు.

◆ ఐకమత్యంగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని పిల్లుట్ల గ్రామాధ్యక్షుడు రఘువరెడ్డి అన్నారు. శుక్రవారం ఉమ్మడి గ్రామ పంచాయతీ ముఖ్య కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, కృష్ణయ్య, కృష్ణ, నాగయ్య, గోనయ్య, భిక్షపతి, రాజయ్య, హనుమంతు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎరగండ్ల గ్రామానికి చెందిన వీరేశం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. అతనికి అత్యవసర చికిత్స కోసం శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు.

శేరిపల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంతో గాయపడి చికిత్స పొందిన శ్రీరామ్ కృష్ణకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, చిన్న కృష్ణాగౌడ్, నర్సింలుగౌడ్, నార్సింగి పట్టణాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

◆ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు బీజేపీ పక్షాన అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ అన్నారు. రెండు రోజుల క్రితం మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామం వద్ద కారు వాగు కల్వలో బోల్తాపడిన సంఘటనలో ఏడుగురు మృతి చెందారు. శుక్రవారం తల్లాపల్లి, జెగ్యా, బీమ్లా తండాల్లో బాధిత కుటుంబాలను బీజేపీ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రావు, భిక్షపతి, భాస్కర్, వినోద్, లోకేశ్, హరినాయక్, రమేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థికాభివృద్ధి

- మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్‌రూరల్: మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. ఇంద్ర మహిళ శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యులు యూనియన్ బ్యాంకు ద్వారా మంజూరైన రుణాలతో ఏర్పాటు చేసుకున్న జూట్ బ్యాగుల తయారీ, స్టీల్ బ్యాంక్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. జూట్ బ్యాగుల తయారీపై మహిళలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెప్మా సీఓ సరిత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బ్యాగుల తయారీని పరిశీలిస్తున్న నర్సయ్య